


శాంత, గుక్క తిప్పుకో ఇక నవ్వలేనన్నట్లు, అలసి
కుండా నవ్వుతున్నదల్లా అతి పోయాను అన్నట్లు దుర్గ వైపు
ప్రయత్నంమీద నవ్వాపుకొని, చూచింది.

దుర్గ కోపంగా ఇంకా కోపంగా తన పేచూస్తూఉంది. ఆమె కోపం చూసి శాంతకు ఇంకా నవొచ్చింది. నవ్వబోయిన శాంత నోటిని, దుర్గ గట్టిగా నొక్కుతూ.

"ఇంక చాలించుతల్లి! నీ నవ్వు" అంది

"నీ కోపం చాలించావు గనుకనా, నేను నవ్వు చాలించటానికి" శాంతి గడుసుగా పలికింది'

"అయినా! ఇప్పుడు నీవేమంత ఘన కార్యం చేశావని అంతగా నవ్వటానికి" అంది దుర్గ కోపాన్ని అణచుకుంటూ.

"లేకపోతే నేనేమంత కొంపలంటు కునేపని చేసానని నువ్వు అంతకోప పడ టానికి" అంత కోపంలోను దుర్గకు నవ్వొచ్చింది.

"అయినా నీలాంటి రాలుగాయికి, శాంత అని పేరుపెట్టిన మీ అమ్మానాన్న ల్ని అనాలి" అంది దుర్గ నవ్వాపుకుంటూ

"నీకూ పెట్టారుగా మీ అమ్మా నాన్న దుర్గా అని' ఎందుకూ? నీకేమయినా రోషముందీ? ఇంతకీ దుర్గా! నే చెప్పేది పూర్తిగా వినకుండానే అంత కోపమొచ్చిం దేం నీకు?

"ఇంకా పూర్తిగా వినాలా? నీవు ప్రారంభించగానే అర్థమైంది.

"ఏమని ప్రారంభించానేం?" అంది శాంత.

"చెప్పావుగా, ఈరోజు సాయంకాలం నాకోసం వో పక్షి థియేటర్ దగ్గర ఎదురుచూస్తుంటాడని" అంది దుర్గ.

"ఆ!—తరువాత—" అని ఏదో చెప్పబోయిన శాంత మాటకు దుర్గ అడ్డు వస్తూ'

"అపు తల్లి అపు. నీ కథ నేను విన దల్చుకోలేదు' అయిదు కావస్తూంది. నేనిం టికి వెళ్ళాలి. రోజు ఇంత ఆలస్యం చేస్తావేమని, కాలేజి నుంచి వెళ్ళగానే అమ్మ కోప్పడుతూంది" అంటూ దుర్గ లేవబోతుంటే, మళ్ళీ బలవంతాన కూర్చో బెట్టి.

"ప్లీజ్! వినవూ! అంతగా అయితే ఆంటీకి నేనొచ్చి చెపుతాను" అంటూ కూర్చో బెట్టింది. చేసేది లేక దుర్గ కూర్చుంది. శాంత పట్టుదల ఆమెకు తెలియకకాదు. శాంత చెప్పటం ప్రారం భించింది.

"నిన్న ఆదివారం పిక్చరు కెడదా మని నీకు ఫోను చేశాను. నీవేమో, ఏదో పనుందాని రానంటివి నేనూ మానేద్దా మనుకున్నాను. కాని, మరీ బోరుగా వుంటేనూ ఒక్కర్తైనే బయలుదేరాను' రష్‌గా వుంటుందేమోనని కాస్త ముందు గానేవెళ్ళాను. కాని అక్కడ జనం ఆట్టే లేరు. నేను కూర్చొన్న సీటుకి కొంచం ముందుగా అయిదారుగురు కూర్చున్నారు" అని చెప్పుకుపోతూ, దుర్గ వింటుందో లేదోనని ఆమె వైపు చూసింది శాంత. ఆమె శ్రద్ధగానే వింటున్నట్లు కనిపించింది శాంత మళ్ళీ ప్రారంభించింది.

పిక్చరు ఏమీ నచ్చలేదు. ఒకటే బోరు అని అంది శాంత.

"అవును. నీకన్నీ బోరే: క్లాసుబోరు. యింట్లో బోరు, పిక్చరు బోరు" అంటూ ఎత్తి పొడుపుగా అంది దుర్గ.

"సరేలే విను. ఇన్‌టర్‌వల్‌లో లైట్లు వెలగ్గానే ప్రక్కగా చూశాను. నేను కూర్చున్న వరుసలోనే నాలుగు సీట్లకు అవతల ఒకతను కూర్చున్నాడు. అతను నన్నే చూస్తున్నవాడల్లా నేనటు చూడగానే తల త్రిప్పుకున్నాడు. అటువేపు కాఫీ కుర్రాడు వెళ్లుతున్నాడు. నేను పిలిచాను. కాని వాడికి వినపడలేదు. పోనీలెమ్మని కూర్చున్నాను, ఆ ప్రక్క కూర్చున్నతను బయటికెళ్ళి కాసేపట్లో కాఫీ కప్పుతో ప్రత్యక్షమయ్యాడు."

"ఆ! అంది ఆశ్చర్యంగా దుర్గ.

"ఆ! మరి సరాసరి నా దగ్గరికొచ్చి హి....హి....హి....అంటూ మీరు కాఫీ కుర్రాణ్ణి పిలిచారు. వాడేమో వినిపించుకోలేదు. తీసుకోండి. హి....హి....హి...." అంటూ కాఫీ కప్పు నా నోటి కందించినంత పనిచేశాడు. నేను కప్పు అందుకోటం ఆలస్యమయితే, నిజంగా అంత పనీ చేస్తాడేమోనని భయపడి కప్పు అందుకున్నాను.

వెంటనే అతను "థ్యాంక్యూ" అంటూ నా ప్రక్క సీట్లోనే కూర్చున్నాడు పళ్ళికిలిస్తూ. యింతకూ అతను 'థ్యాంక్యూ' అన్నది నేను కాఫీ తీసుకున్నందుకా, లేక అతను నా ప్రక్కన కూర్చున్నందుకా? అన్నది నాకర్థం కాలేదు అంటూ దుర్గ వైపు చూసింది శాంత

దుర్గ "ఆ!" అని ఆశ్చర్యంతో తెరచుకున్న నోరు యింకా మూసుకోనే లేదు, అలానే కళ్ళప్పగించి చూస్తుంది. ఆమె రెస్పాన్సు చూసి శాంత, "ఇంక నోరు మూసుకోవోయ్:" అంటూ నవ్వేసింది. దుర్గకు కూడా నవ్వాగలేదు.

"ఆ: తర్వాత" అంది దుర్గ కుతూహలాన్ని దాచుకోటానికి ప్రయత్నిస్తూ.

"తర్వాతేముంది? నా పేరు, నేనేమీ చేస్తున్నది ఆదిగాగల వివరాలన్ని అడిగాడు. ఇది వీళ్ళకో జబ్బు అనుకొన్నాను నేను మనసులోనే.

"ఇంతకూ అన్నిటికి బదులు చెప్పావా?" అంది దుర్గ.

"ఆ: చెప్పాను మరి. చెప్పకపోతే ఎలా? అతనంత యిదిగా అడుగుతున్నపుడు. చెప్పటమే గాదు. నేను అంత ఓపికగా అతను అడిగిన వాటికి బదులు చెప్పినందుకు ఆ అబ్బాయి అలా ఐసయి పోయి, రేపు....రేపు....అంటూ కాసేపు నసిగి, రేపు పిక్చరుకు వెళదాము వస్తారా? అన్నాడు.

"నీ పని పడ్తానుండు" అని మనసులోనే అనుకొని, ఏ పిక్చరుకు? అని అడిగాను. అతను సంతోషంతో కాస్త ఉబ్బిపోవటం వలన కుర్చీ కాస్త ఇరుకయిందేమో, అదేపనిగా అటూ ఇటూ సర్దుకుని హి....హి....హి....అంటూ

"విషపు మనసులు బాగుందట" అన్నాడు

"ఆ: అదేం బాగాలేదట "వుండయ్యా

నామం పెడతాను'' చాలా బాగుందట'' అన్నాను, అతను సరేనన్నాడు. ఈవేళ సాయంత్రం షో టిక్కెట్స్ తీసుకొని ధియేటరు దగ్గర ఉండమని చెప్పాను. పాపం నా కోసం ఎదురు చూస్తుంటాడు'' అని కథ ముగించింది శాంత.

''పైగా, పాపం! అంటావు. నీకేదో జాలి వున్నట్లు, అలా చేస్తే అతనేమనుకుంటాడు? ఈ పెంకె పనులు చేయొద్దని నీ కెన్నిసార్లు చెప్పినా ప్రయోజనము లేదు.'' అంది దుర్గ.

''ఏమనుకుంటాడు? అక్కడ నా కోసం ఎదురు చూసి, చూసి ఈ అమ్మాయి నామం పెట్టింది'' అనుకుంటాడు. అంతేనా? సరేలే లే, వెళదాం'' అంటూ దారి తీసింది. ఇద్దరు బయలుదేరారు.

''రేపు మనకు టెస్టుందన్న సంగతి మరిచావా?'' దుర్గ జ్ఞాపకంచేసి మామూలు టైమ్‌కంటే గంట ముందుగా వస్తే ఇద్దరు కలిసి చదువుకోవచ్చని చెప్పింది. శాంత సరేనంది.

అనుకున్న ప్రకారం గంట ముందుగా శాంత వస్తుందని దుర్గ శాంత కోసం కాలేజి ఆవరణలో స్విమ్మింగ్‌పూల్ దగ్గర ఎదురు చూస్తుంది. శాంత ఎంతకూ రాలేదు. ఇక ప్రయోజనం లేదనుకుని క్లాసు కెళ్ళింది. తను క్లాసు కెళ్ళిన కాసేపటికి ఆలస్యంగా, ఆయాసపడుతూ, శాంత క్లాసు కొచ్చింది. టెస్టు అయిన తరువాత ఇద్దరూ బయటి కొచ్చారు.

''ఎకదుకంత ఆలస్యంగా వచ్చావు? టెస్టు బాగా వ్రాశావా?'' అని అడిగింది దుర్గ.

''అబ్బా! వుండవే! ఏదో వ్రాశాను కాని, పీకదాక తిని నేను ఆయాసపడి చస్తుంటే'' అపది శాంత.

''ఈ వేళప్పుడు ఏం తిందే?'' అంది దుర్గ.

''ఏం తిందేమిటా? రా, చెబుతాను అంటూ దారి తీసింది. మరేమి గొడవ జేసిందోనని దుర్గ లోలోపల కంగారు పడుతూనే వెళ్ళింది. ఇద్దరూ కూర్చున్నారు.

''దుర్గా! నేనే, మనం అనుకున్నదానికంటే ముందుగానే బయలుదేరానే, స్టాపింగులో బస్ ఎంతకూ రాలేదు; చేసేది లేక విసుక్కుంటూ అలానేనుంచున్నాను. అంతలో ఒక కారు నా ప్రక్కగా వచ్చి ఆగింది. అంతలో ఒకతను, దగ్గర దగ్గర 50 సంవత్సరాలుంటాయిలే. 'లిఫ్ట్' ఇవ్వనా అని ఇంగ్లీషులో అడిగాడు. నేను విననట్లుగా మొహం ఘటు తిప్పుకున్నాను. అతను డోర్ ఓపన్‌చేసి మళ్ళా అడిగాడు. సరేలెమ్మని ఎక్కి కూర్చున్నాను. ఇక త్రోవలో అంతా మామూలే. వెంటపడే జబ్బున్న వాళ్ళందరకూ ఉండే మామూలు ధోరణిలోనే అతడు చాలా ప్రశ్నలు అడిగాడు. మధ్యలో హోటల్ రావటంవల్ల నన్ను కనీసం అడగకుండానే హోటల్ లోపలికి దారి తీశాడు. వద్దన్నా వినిపించుకోకుండా, బోలెడు తెప్పించాడు. ఏలాగూ వచ్చానుకదా అని బాగా తిన్నాను. మళ్ళా రేపు వస్తావా?'' అన్నాడు అని చెప్పి ఆపింది దుర్గ.

''వస్తానన్నావా?'' అని ఆతురతతో అడిగింది దుర్గ.

"ఛ! వుండవే! మధ్య నీ బోడి ప్రశ్నలు, బోడి ఆశ్చర్యాలు నీకు. వస్తానని రానంటానా? రేపు హోటల్ దగ్గర వెయిట్ చేయమని చెప్పాను. రేపు అక్కడ కాచుకుంటాడు. అందుకే ఇంత లేటయింది'' అంది శాంత చాలా తేలికగా నవ్వేస్తూ.

శాంత ప్రవర్తన దుర్గకేమి నచ్చలేదు చెప్పితే అది వినిపించుకునే రకం కాదని తనకు తెలుసు. అయినా చెప్పకుండా వుండలేకపోయింది.

"శాంతా! నీవుచేసే పనేం బాగుండ లేదు. వాళ్ళకు బుద్ధి చెప్పాలనే వుద్దేశంతో నీవా పని చేస్తావు. కాని నీవు అలాంటి వాళ్ళతో తిరగటం ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?'' అని అంది దుర్గ.

"అది తరువాత విషయం. కాని వీళ్ళకు ఇలా బుద్ధి చెప్పితేనే నాకు సంతోషము. లేకుంటే దుర్గా! వీళ్ళకివేంబుద్ధులు చెప్పు? తన చెల్లెలు ఎవరితోనయినా కలిసి తిరిగితే మందలించే ఒక అన్నయ్య, ఇతర్ల పిల్లలతో ఎందుకు స్నేహం చెయ్యాలని ప్రయత్నిస్తాడు? అతనా పని చేయటంవలన వాళ్ళ అన్నయ్యలు తన లాగ బాధపడతారని ఎందుకు అలోచించడు? తన కూతురు ఒక తప్పు చేస్తే ఓర్చుకోలేని తండ్రి ఇతర పిల్లల నెందుకు తప్పుదారి పట్టించాలని ప్రయత్నిస్తాడు? తనలాగే ఇంకొకరి తండ్రి బాధ పడుతాడన్న విషయం అతను ఏందుకు ఆలోచించడు? అయినా ఏదో తెలిసీ తెలియని వయసులో అబ్బాయిలు ఏదో చేశారంటే ఏదో అనుకోవచ్చు కాని, కొందరు పెద్ద వాళ్ళు కూడా ఇలా ప్రవర్తించటంలో అర్థ మేమిటి?'' అంటూ శాంత చాలా ఆవేశంగా మాట్లాడింది. దుర్గ ఏమీ మాట్లాడలేదు. ఇద్దరు ఇళ్ళ వైపు దారి తీశారు.

* * *

నాలుగు రోజులుగా శాంత కాలేజికి రావటం లేదు. దుర్గ కంగారు వడింది. ఆ రోజు శాంతను గురించే ఆలోచిస్తూ స్విమ్మింగ్‌పూల్ దగ్గర సాయంకాలం కాలేజి అయిన తరువాత కూర్చుంది. శాంత వెనుక నుంచి వచ్చి దుర్గ కళ్లు మూసింది. దుర్గ కంగారుపడ్డా తరువాత శాంత అని గుర్తించి, నాలుగు రోజులు తనను చూడనందుకు నాలుగు సంవత్సరాలుగా చూడనట్లు అనిపించిందంటూ కారణం అడిగింది. శాంత పెద్దగా ఫోజు పెట్టి అటు తిరిగి కూర్చుంది.

"ఏమిటే నీ సన్యాసు?చెప్పు త్వరగా'' అంది దుర్గ.

"అంత త్వరగా చెప్పే న్యూస్ కాద మ్మాయ్! చాలా గుడ్ న్యూస్. బాగా బ్రతిమాలుకుంటే కాని చెప్పను'' అంది శాంత.

"అబ్బా! అలానే బ్రతిమాలుకుంటానులేవే! కావాలంటే నీకు ఐస్‌క్రీమ్ కూడా యిప్పిస్తా. విసిగించక త్వరగా చెప్పు'' అంది దుర్గ. శాంత అమాంతం దుర్గను గట్టిగా కౌగలించుకొంటూ "నా పెళ్ళి'' అంది. దుర్గ ఆశ్చర్యంగా నోరు చేటంత చేసుకుంది. తాను ఇంటినుంచి అదేపనిగా తీసుకొచ్చిన స్వీట్లు నాలుగు ఒక్కసారే దుర్గ నోటిలో కుక్కింది శాంత. దుర్గ వుక్కిరి బిక్కిరై పోయింది. కాసేపటికి తేరుకుని "ఏమిటి పెళ్ళా?నిజం

గానే? ఏమిటే ఈ సర్‌ప్రయిజ్ న్యూస్'' అంటూ శాంత చెవులు గిల్లింది దుర్గ.

''నిజంగానే, ఈ విషయం నీతో ముందుగానే చెప్పవలసింది, కాని నీవు కోప్పడతావని చెప్పలేదు, ఒక అబ్బాయ్ నన్ను చాలా కాలంగా ఫాలో చేస్తున్నాడు, అయితే అతను నన్నెప్పుడూ పలకరించలేదు. కాని అతని కళ్ళుమాత్రం నేను తట్టుకోలేనంత యిదిగా నన్నే చూసేవి. ఒకరోజు మామూలు ప్రకారం అతని పని కూడా పట్టాలనుకున్నాను. నేనుగా మాట్లాడాను' అతనేమి ఎక్కువ మాట్లాడలేకపోయాడు. అతను చాలా మంచివాడిలా కనిపించాడు. మరి అలా వెంబడించడ మెందుకో? పార్కుకు రమ్మన్నాను. అంతే. నా మామూలు ప్రకారం నేను వెళ్ళలేదు, అతడు ఎదురు చూశాడేమో! మరురోజు నేను కాలేజికి వచ్చేటప్పుడు ఎదురై కాస్త భయపడుతూనే ''ఎందుకు రాలేదు?'' అని అడిగాడు. నేను ఏదో కారణం చెప్పి రేపు వస్తానన్నాను, అలా అతనిని దగ్గర దగ్గర నెల రోజులు తిప్పించాను. అతను రోజు ఎదురు చూడటం, మరురోజు నన్ను ఎందుకు రాలేదని అడగటం మామూలయింది. అతని ఓపికకు నాకు ఆశ్చర్యమేసింది. ఇప్పుడు నాలుగు రోజులకు ముందు ఏం చెబుతాడో చూదామని చెప్పిన ప్రకారం వెళ్ళాను. అతను ఎదురు చూసి ఇక రాననుకున్నాడేమో, అప్పుడే తిరిగి వెళ్ళబోతున్నవాడల్లానన్ను నన్ను చూచి ఆగిపోయాడు. అతని కళ్ళలో తిరుగుతున్న నీటిబెందువులుచూసి ఆశ్చర్యపోయాను. పాపం! కాస్త జాలి కూడా వేసిందే. ఏం మాట్లాడాలో నాకు తోచలేదు. కాసేపు కూర్చున్నాను. నేను మౌనంగా వుండిపోయాను. అతనే కాసేపటికి నేను నెలరోజులుగా, ఆ విధంగా చేసినందుకు చాలా బాధపడినట్లు తెలిపి, తనను అలా వెంబడించి, ఏదో కాలక్షేపం కోసం స్నేహం చేసే వాళ్ళలాగ అనుకోవద్దని చెప్పాడు. అంతేకాకుండా అతను నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు. నాకేమి అర్థం కాలేదు. ఏం మాట్లాడాలో తోచక, కాసేపు మాట్లాడి ఇంటి కొచ్చేసాను. మరురోజు ఉదయమే ఆ అబ్బాయి తల్లి దండ్రులు మా ఇంటికి రావటం, అన్ని విషయాలలోను వాళ్ళ తల్లితండ్రులకు, మా తల్లిదండ్రులకు సమ్మతి కలగడం నాకు అంతా వింతగా ఒక కలలాగా అనిపించింది, ఇంకేముంది మా పెళ్ళి నిశ్చయమయింది'' అంటూ దుర్గవైపు చూసింది శాంత. దుర్గబొమ్మలా ఉలుకు పలుకూ లేకుండా కూర్చుండిపోయింది. శాంత కంగారుగా ముక్కు దగ్గర చేయిపెట్టి చూసింది. ''హమ్మయ్య పరవాలేదు, ఊపిరాడుతుంది'' అంటూ.

''ఏయ్, దుర్గా!'' అంటూ కదిపిం తరువాతకాని, దుర్గ ఈ లోకం లోనికి రాలేదు. రావటమే తడువాయి శాంతను సంతోషంగా కౌగలించుకొని,

"అమ్మ దొంగా! ఎంతపని చేశావే?" అంది, అందుకు శాంత,

"అబ్బే! నేనేం చేశానే? అలవాటుగా చేయబోయిన పనిలో కాస్త పొరపాటు చేశాను, అంతే'' అంది ఇద్దరు గల గల మని నవ్వుకున్నారు. వాళ్ళ నవ్వుల గలగల స్విమ్మింగ్‌పూల్ ప్రక్కనున్న ఫౌన్‌టెన్ నుంచి పడుతున్న జలబిందువుల గలగలతో శృతి కల్పింది. ◆